సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
ఆదివారం । 21 । జూలై । 2024



టన్ను చీనీ రూ.20 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో శనివారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.20 వేలు, కనిష్టంగా రూ.10 వేల ప్రకారం పలికాయి.



టమాట కిలో రూ.56

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట గరిష్టంగా రూ.56, కనిష్టంగా రూ.35 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి

గరిష్టం/కనిష్టం
30.8°/21.6°

జిల్లాలో శనివారం ఉష్ణోగ్రతలు తగ్గాయి. గాలి వేగం పెరిగింది. ఆకాశం మేఘావృతమై పలు మండలాల్లో తేలికపాటి వర్షం కురిసింది. గంటకు 10 నుంచి 16 కి.మీ వేగంతో నైరుతి దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

హిమచల్‌ప్రదేశ్ గవర్నర్‌కు ఘన స్వాగతం



శాంతిభవన్ అతిథి గృహానికి విచ్చేస్తున్న గవర్నర్ శివప్రతాప్ శుక్లా దంపతులు

ప్రశాంతి నిలయం: గురుపౌర్ణమి వేడుకల్లో పాల్గొనేందుకు హిమాచల్ ప్రదేశ్ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా శనివారం రాత్రి ప్రశాంతి నిలయం చేరుకున్నారు. తన సతీమణితో కలిసి బెంగళూరు ఎయిర్‌పోర్టు నుంచి రోడ్డు మార్గాన బయలుదేరి రాత్రి 10.55 గంటలకు పుట్టపర్తి ప్రశాంతి నిలయంలోని శాంతి భవన్ అతిథి గృహం చేరుకున్నారు. అక్కడ గవర్నర్ దంపతులకు కలెక్టర్ చేతన్, ఎస్పీ రత్న, సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ రాజు, ట్రస్ట్ సభ్యుడు నాగానంద తదితరులు ఘన స్వాగతం పలికారు. ఆదివారం ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంత్ సభా మందిరంలో జరిగే గురుపౌర్ణమి వేడుకల్లో శివప్రతాప్ శుక్లా ముఖ్య అతిథిగా పాల్గొననున్నారు.

టీబీ డ్యాంకు పోటెత్తుతోన్న వరద

బొమ్మనహాళ్: తుంగభద్ర జలాశయానికి వరద ఉధృతి ఆగడం లేదు. శుక్రవారం 1,08,790 క్యూసెక్కులు ఉన్న ఇన్‌ఫ్లో శనివారం ఉదయానికి 1,16,040 క్యూసెక్కులకు పెరిగింది. జలాశయం ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తుండడంతో తుంగ నది పోటెత్తుతోంది. ఈ క్రమంలో పరుగులు తీస్తూ ఆ నీరంతా టీబీ డ్యాం చేరుతోంది. ఇన్‌ఫ్లో ఇలాగే కొనసాగితే నాలుగు రోజుల్లో జలాశయం పూర్తిగా నిండవచ్చని బోర్డు అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం డ్యాంలో 105.788 టీఎంసీల పూర్తి నీటి నిల్వ సామర్థ్యానికి గానూ 65.110 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఈ నెల 22 నుంచి హెచ్చెల్సీకి నీరు విడుదల చేయనున్నట్లు ఇప్పటికే టీబీ బోర్డు ప్రకటించిన విషయం తెలిసిందే.

క్రమం తప్పకుండా ట్యాంకులు శుభ్రం చేయించాలి



రామాపురంలో తాగునీటి ట్యాంకును పరిశీలిస్తున్న డీపీఓ విజయ్‌కుమార్

బత్తలపల్లి: గ్రామాల్లోని ఓవర్ హెడ్ ట్యాంకులను 15 రోజులకు ఒకసారి శుభ్రం చేయించాలని జిల్లా పంచాయతీ అధికారి(డీపీఓ) విజయ్‌కుమార్ ఆదేశించారు. శనివారం ఆయన మండలంలోని ఓబుళాపురం పంచాయతీలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను తనిఖీ చేశారు. గ్రామంలోని ఓవర్ హెడ్ ట్యాంకులు, పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, పంచాయతీల్లో పారిశుద్ధ్య పనులు ఎప్పటికప్పుడు జరుగుతున్నాయని, ట్యాంకులు కూడా శుభ్రం చేయిస్తున్నామన్నారు. నీరు పరిశుభ్రంగా ఉంటే రోగాలు దరిచేరవన్నారు. అందువల్ల ప్రతి పంచాయతీ కార్యదర్శి గ్రామ పంచాయతీలోని ఓహెచ్ఎస్ఆర్, జీఎల్ఎస్ఆర్‌లను 15 రోజులకు ఒకసారి శుభ్రపరచాలన్నారు. డీపీఓ వెంట ఈఓఆర్డీ దివాకర్, పంచాయతీ కార్యదర్శి పద్మావతి, ఎంపీహెచ్ఏ, ఏఎన్ఎం, ఆశా వర్కర్, క్లాప్‌మిత్ర తదితరులు పాల్గొన్నారు.

- రెండు నెలల క్రితం బుక్కపట్నం మండలం జానకంపల్లి వద్ద 14 ఏళ్ల కుర్రాడు బైక్ నడుపుతూ కింద పడ్డాడు. వెనుక వస్తున్న వాహనం కూడా ప్రమాదానికి గురైంది. పోలీసులు ఆరా తీస్తే బైక్ నడుపుతున్న కుర్రాడు మైనర్ అని తేలింది. ప్రాణనష్టం లేకపోవడంతో... అవతలి వ్యక్తి ఎలాంటి ఫిర్యాదు చేయకుండా హెచ్చరించి పంపించాడు.
- పుట్టపర్తి సమీపంలో ఓ యువతి కారు వేగంగా నడుపుతూ రోడ్డు పనులు చేస్తున్న కూలీలను ఢీకొట్టింది. ప్రమాదంలో ఒకరు మరణించగా.. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. సదరు యువతికి డ్రైవింగ్ లైసెన్సు లేదని తేలింది. అయితే అవతలి వ్యక్తి ఫిర్యాదు చేయకపోవడంతో కేసు నమోదు కాలేదని సమాచారం.
- మామిళ్లపల్లి వద్ద 17 ఏళ్ల కుర్రాడు ఎఫ్‌జెడ్ బైక్‌ను అతి వేగంగా నడుపుతూ మరో బైక్‌ను ఢీకొట్టాడు. భారీ ప్రమాదం జరిగింది. ఇద్దరూ స్పృహ తప్పి పడిపోయారు. ఈ ఘటనపై పోలీసులు ఆరా తీస్తే.. ఒకరు మైనర్ కాగా, మరొకరికి డ్రైవింగ్ లైసెన్సు లేదని తేలింది. దీంతో కేసు కోర్టుకెళ్లినా నిలవలేదు.

... జిల్లాలో చాలా ప్రమాదాలు మైనర్లు, లైసెన్స్ పొందని వారి వల్లే జరుగుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. ప్రమాదాల్లో వాహనం నడిపే వారితో పాటు ఎదురుగా వచ్చే వాహనం డ్రైవర్లూ తీవ్రంగా నష్టపోతున్నారు. ఒక్కోసారి ఆయా కుటుంబాల్లో తీరని శోకం మిగులుతోంది.

బండిస్తే.. గండమే!



మైనర్‌కు వాహనమిస్తే ముప్పే

- లైసెన్సు లేకపోయినా రోడ్లపై దూసుకెళ్తున్న యువత
- అధిక స్పీడ్...అవగాహన రాహిత్యంతో ప్రమాదాలు
- వేలాది కుటుంబాల్లో తీరని శోకం
- ఎదురుగా వస్తున్న వాహనదారులకూ తీరని నష్టం



సాక్షి, పుట్టపర్తి: లైసెన్స్ లేకపోయినా మైనర్లు బైక్‌లపై చక్కర్లు కొడుతున్నారు. రోడ్లపై రయ్యిమంటూ దూసుకెళ్తున్నారు. వేగంగా నడుపుతూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. ఇలాంటి ఘటనల్లో లైసెన్స్ లేకుండా వాహనంతో రోడ్డుపైకి వచ్చే మైనర్లది ఎంత తప్పు ఉందో.. వారికి వాహనం ఇచ్చిన తల్లిదండ్రులు, యజమానిదీ తప్పే అంటూ సుప్రీంకోర్టు పలుమార్లు స్పష్టం చేసింది. అయినప్పటికీ ఇటు మైనర్ల తీరూ మారలేదు. అటు తల్లిదండ్రుల్లోనూ మార్పు కనిపించడం లేదు. పిల్లాడు అడగడమే ఆలస్యం లైసెన్స్ పొందే వయస్సు రాకపోయినా 250 సీసీ, 350 సీసీ బైక్‌లు కొనిస్తూ... వారి జీవితాలను ఇబ్బందుల్లోకి నెట్టేస్తున్నారు.

మైనర్ల వల్లే ఎక్కువ ప్రమాదాలు

జిల్లాలో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదాలను పరిశీలిస్తే... ప్రమాదాలకు ఎక్కువ శాతం మైనర్లే కారణంగా తేలింది. అలాగే డ్రైవింగ్ సరిగా రాని వారు.. లైసెన్సులు లేకుండా బండ్లతో రోడ్డెక్కుతున్న వారి కారణంగానూ ప్రమాదాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. మైనర్లు వాహనాలతో రోడ్డెక్కడం వల్ల... నిబంధనలన్నీ పాటిస్తూ డ్రైవింగ్ చేస్తున్న వారూ ప్రమాదాల బారిన పడి... చేయని తప్పునకు శిక్ష అనుభవిస్తున్నారు. మైనర్లకు వాహనాలు ఇచ్చిన తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తున్నా.. ఫలితం లేకుండా పోతోంది. తమ పిల్లాడు బాగా వాహనం నడుపుతున్నాడనే సంతోషంలో తల్లిదండ్రులు వారిని మరింత ప్రోత్సహిస్తున్నట్లు తెలుస్తోంది. ఫలితంగా ఎంతోమంది ప్రాణాలు కోల్పోవడానికి కారకులు అవుతున్నారు.

ఉల్లంఘనుల్లోనూ వారే అధికం

ట్రాఫిక్ ఉల్లంఘనలను మూడు కేటగిరీలుగా విభజిస్తారు. వాహనం నడిపే వ్యక్తికి ముప్పు కలిగించేవి.. ఎదుటి వారికి ముప్పుగా మారేవి.. వాహన చోదకుడితో పాటు ఎదుటి వ్యక్తికీ ముప్పు తెచ్చిపెట్టేవి. ఇందులో మైనర్ డ్రైవింగ్ మూడో కేటగిరీలోకి వస్తుందని ట్రాఫిక్ పోలీసులు చెబుతున్నారు. ఏడాది వ్యవధిలో జిల్లాలో జరిగిన ప్రమాదాలను విశ్లేషిస్తే.. ద్విచక్ర వాహనాల కారణంగానే ఎక్కువగా జరుగుతున్నట్లు తేలింది. ఆ తర్వాతి స్థానం తేలికపాటి వాహనాలుగా పిలిచే కార్లు ఉంటున్నాయి. ద్విచక్ర వాహనాల ద్వారా జరిగే ప్రమాదాల్లో వాహన చోదకుడితో పాటు పాదచారులు ఎక్కువగా మృత్యువాత పడుతున్నారు.

గత మూడేళ్లలో జిల్లాలో జరిగిన ప్రమాదాలు, మృతుల సంఖ్య ఇలా..

సంవత్సరం	ప్రమాదాల సంఖ్య	మృతుల సంఖ్య	క్షతగాత్రుల సంఖ్య
2022	508	304	627
2023	531	344	579
2024 జూన్ వరకు	321	172	256

- ఇప్పటి వరకు జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 80 శాతం మంది డ్రైవింగ్ లైసెన్సులు లేని వారు. కాగా, 73 శాతం మంది మృతికి మైనర్ల డ్రైవింగే కారణంగా తెలుస్తోంది.

రేసింగ్‌లతోనే డేంజర్

చాలా ప్రైవేటు విద్యాసంస్థలు పట్టణ శివారు ప్రాంతాల్లో ఉంటాయి. యువత కాలేజీలకు ద్విచక్ర వాహనాల్లో వస్తుంటారు. అదేవిధంగా బెంగళూరు నుంచి వారంతపు సెలవుల్లో చాలామంది లేపాక్షి తదితర ప్రాంతాలకు వస్తారు. వీరిలో చాలా మంది బైక్ రేసింగ్‌లో పాల్గొంటూ ప్రమాదాల బారిన పడుతున్నారు. బైక్‌లలో వెళ్తూ.. సెల్ఫీలు తీసుకోవడం కారణంగానూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. అదేవిధంగా కాలేజీలకు వెళ్లే సమయంలో ఒక్కో వాహనంలో ముగ్గురు చొప్పున అధిక వేగంతో వెళ్లడం కారణంగానూ ప్రమాదాలు జరుగుతున్నాయి.

నిబంధనలు ఏం చెబుతున్నాయంటే..

భారత మోటారు వాహనాల చట్టం ప్రకారం 16 ఏళ్ల లోపు వయస్సు కలిగిన వారు వాహనాలు నడపకూడదు. అది నేరం కూడా. 16 నుంచి 18 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న వారు గేర్లు లేని వాహనాలు నడపవచ్చు. 18 ఏళ్లు నిండి డ్రైవింగ్ నేర్చుకున్నాక రవాణా శాఖాధికారుల ద్వారా తప్పనిసరిగా లైసెన్సులు పొందాలి. మైనర్లు వాహనాలు నడపటం చట్ట విరుద్ధం. వారికి వాహనం ఇచ్చిన వారిపై కూడా కేసు నమోదు చేస్తారు.

లైసెన్సు తప్పనిసరి



"మోటారు వాహనాల చట్టం ప్రకారం వాహనాలు నడిపే వారంతా తప్పనిసరిగా లైసెన్సు తీసుకోవాలి. అలాకాకుండా బండితో రోడ్డెక్కితే తగిన మూల్యం చెల్లించుకోవాల్సిందే. నిబంధనల ప్రకారం దరఖాస్తు చేసుకున్న వారికి డ్రైవింగ్ పరీక్షలు నిర్వహించి లైసెన్సులు అందజేస్తున్నాం.

– ఎమ్మెస్ కరుణసాగర్‌రెడ్డి, జిల్లా రవాణా అధికారి



కోర్టు కోసం ప్రత్యామ్నాయ భవనాల పరిశీలన



పాత రెవెన్యూ కార్యాలయ భవనాలను పరిశీలిస్తున్న అదనపు జిల్లా జడ్జి శైలజ, న్యాయమూర్తి శ్రీధర్ తదితరులు

హిందూపురం అర్బన్: స్థానిక ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి న్యాయస్థానం, ప్రత్యేక న్యాయస్థానం భవనాలు శిథిలావస్థకు చేరడంతో అధికారులు ప్రత్యామ్నాయ భవనాల కోసం పరిశీలన చేపట్టారు. ఈ క్రమంలో శనివారం అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ, సీనియర్ జడ్జి శ్రీధర్‌తో కలిసి పాత రెవెన్యూ కార్యాలయాన్ని పరిశీలించారు. పట్టణంలోని పాత రెవెన్యూ కార్యాలయాన్ని ఇటీవలే నూతన భవనంలోకి మార్చారు. ఈ క్రమంలో పాత రెవెన్యూ కార్యాలయాన్ని తాత్కాలిక న్యాయస్థానాల నిర్వహణ కోసం ఇచ్చేందుకు కలెక్టర్ చేతన్ సుముఖత వ్యక్తం చేశారు. దీంతో న్యాయమూర్తులు సదరు భవనాలను పరిశీలించారు.

జిల్లా జడ్జి చొరవతో...

ఇటీవల హిందూపురం పర్యటనకు వచ్చిన జిల్లా జడ్జి శ్రీనివాస్ కోర్టు భవనాల దుస్థితిని గమనించారు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన చేతన్ మర్యాదపూర్వకంగా తనను కలిసిన సమయంలో హిందూపురంలో కోర్టుల కోసం ప్రత్యామ్నాయ భవనాలు చూడాలన్నారు. దీంతో కలెక్టర్ చేతన్... గతంలో రెవెన్యూ కార్యాలయం కొనసాగిన భవనాలను కోర్టులకు ఇచ్చేందుకు అంగీకరించారు. దీంతో అదనపు జిల్లా జడ్జి శైలజ న్యాయవాదులు, సిబ్బందితో కలిసి పాత రెవెన్యూ భవనాన్ని పరిశీలించారు. కోర్టు కార్యకలాపాలకు పనికి వస్తుందా...లేదా అని సిబ్బందితో చర్చించారు. జడ్జి వెంట ప్రభుత్వ న్యాయవాది శ్రీనివాసరెడ్డి, ఏపీ నరసింహులు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజశేఖర్, న్యాయవాదులు సిద్ధూ, కళావతి, శివశంకర్ తదితరులు ఉన్నారు.

బయోమెట్రిక్ హాజరు తప్పనిసరి

- సచివాలయ ఉద్యోగులకు ఆదేశం



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ నరసయ్య

పుట్టపర్తి అర్బన్: గ్రామ, వార్డు సచివాలయాల్లో పని చేస్తున్న ఉద్యోగులు రోజూ మూడుసార్లు తప్పని సరిగా బయోమెట్రిక్ అటెండెన్స్ వేయాలని గ్రామ/వార్డు సచివాలయ నోడలాఫీసర్ శివారెడ్డి, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య ఆదేశించారు. శనివారం వారు పుట్టపర్తి ఎంపీడీఓ కార్యాలయంలో సచివాలయ ఉద్యోగులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సచివాలయ ఉద్యోగులంతా రోజూ ఉదయం 10 గంటలకు, మధ్యాహ్నం 3 గంటలకు, సాయంత్రం 5 గంటలకు బయోమెట్రిక్ హాజరు వేయాలన్నారు. అలాగే సచివాలయాల్లో ఈ-సర్వీస్‌లను పెంచాలన్నారు. పింఛన్ల పంపిణీ కూడా ప్రతి నెలా మొదటి రెండు రోజుల్లోనే పూర్తి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. ఆ తర్వాత మిగిలిన పింఛన్ సొమ్ము వెంటనే సంబంధిత అధికారుల ద్వారా ప్రభుత్వానికి అందజేయాలన్నారు. పింఛన్ల పంపిణీలో ఎక్కడైనా అవకతవకలు జరిగితే కఠిన చర్యలు ఉంటాయన్నారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చూడాలన్నారు. పనివేళల్లో బయటకు వెళితే తప్పనిసరిగా లాగ్ బుక్‌లో పొందుపరచాలన్నారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో మురుగునీరు తొలగించడం, వాటర్ ట్యాంకులు శుభ్రం చేయడం, నీటి కాలుష్యం లేకుండా చూడాలన్నారు. సమావేశంలో ఎంపీడీఓలు నాగేశ్వరరెడ్డి, అశోక్‌కుమార్‌రెడ్డి, శ్రీనివాసులు, దొలాసాబ్, అమరనాథరెడ్డి, ఇందిరాదేవి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గురుపౌర్ణమి వేడుకలు ప్రారంభం



సాయి కుల్వంత్ హాలులో కచేరీ నిర్వహిస్తున్న జేపీ జయంత్ బృందం

ప్రశాంతి నిలయం: రెండు రోజుల పాటు నిర్వహించనున్న గురుపౌర్ణమి వేడుకలు ప్రశాంతి నిలయంలో శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. సాయికుల్వంత్ సభా మందిరంలో సత్యసాయి మహాసమాధి చెంత వేదపఠనంతో వేడుకలు ప్రారంభించారు. అనంతరం ప్రముఖ ఫ్లూట్ వాయిద్యకారుడు జేపీ జయంత్ తన బృందంతో కలిసి కచేరీ నిర్వహించారు. సత్యసాయి, శ్రీకృష్ణుడి లీలలను గుర్తు చేస్తూ ఫ్లూట్‌పై చక్కటి స్వరాలొలికిస్తూ కచేరీ చేశారు. భక్తులు సత్యసాయి మహా సమాధిని దర్శించుకున్నారు.

రష్యాలో పుల్లీకుంట యువతి మృతి

- ఎంబీబీఎస్ చదివేందుకు వెళ్లిన శ్రీవిద్య
- శనివారం స్వగ్రామంలో అంత్యక్రియలు

అమరాపురం: మండలంలోని పుల్లీకుంటకు చెందిన వైద్య విద్యార్థి శ్రీవిద్య (24) అనారోగ్యంతో బాధపడుతూ రష్యాలో మృతి చెందింది. కుటుంబీకులు తెలిపిన వివరాల మేరకు...పుల్లీకుంటకు చెందిన కెంచప్ప కుమార్తె శ్రీవిద్య నాలుగేళ్ల క్రితం ఎంబీబీఎస్ చదివేందుకు రష్యాకు వెళ్లింది. అక్కడి ఓ యూనివర్సిటీలో ఎంబీబీఎస్ నాలుగో సంవత్సరం చదువుతున్న ఆమె 20 రోజుల క్రితం అనారోగ్యానికి గురైంది. స్నేహితులు ఆస్పత్రిలో చేర్పగా... చికిత్స పొందుతూ ఈ నెల 16వ తేదీ మృతి చెందింది. దీంతో కుటుంబీకులు శ్రీవిద్య మృతదేహాన్ని శనివారం స్వగ్రామానికి తీసుకువచ్చారు. బంధువులు, కుటుంబీకులు, ఆప్తుల అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు నిర్వహించారు. నాలుగేళ్ల వైద్య విద్య పూర్తి చేసిన బిడ్డ పట్టాతో ఇంటికొస్తుందనుకుంటే ప్రాణం కోల్పోయి వచ్చిందని కుటుంబీకులు కన్నీరు మున్నీరయ్యారు.

జేఎన్‌టీయూ రిజిస్ట్రార్‌గా కృష్ణయ్య



ప్రొఫెసర్ కృష్ణయ్యకు అభినందనలు తెలియజేస్తున్న ఇన్‌చార్జ్ వీసీ సుదర్శన రావు

అనంతపురం: జేఎన్‌టీయూ (ఏ) రిజిస్ట్రార్‌గా ప్రొఫెసర్ ఎస్. కృష్ణయ్య నియమితులయ్యారు. ఈ మేరకు ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ హెచ్. సుదర్శన రావు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. రిజిస్ట్రార్‌గా బాధ్యతలు చేపట్టిన అనంతరం కృష్ణయ్య విలేకరులతో మాట్లాడారు. రిజిస్ట్రార్‌గా ఎంపిక చేసిన వీసీకి కృతజ్ఞతలు తెలిపారు. బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తానన్నారు. వర్సిటీ పురోగతికి కృషి చేస్తానన్నారు. అనంతరం ఆయనను వర్సిటీ డైరెక్టర్లు, బోధన, బోధనేతర సిబ్బంది అభినందనలు తెలియజేశారు. కాగా, గతంలో టీడీపీ అధికారంలో ఉన్న 2014 నుంచి 2019 వరకూ జేఎన్‌టీయూ రిజిస్ట్రార్‌గా కృష్ణయ్య పనిచేశారు. ఇటీవల టీడీపీతో కూడిన కూటమి మళ్లీ అధికారంలోకి రాగానే రిజిస్ట్రార్‌గా ఆయననే నియమించడం గమనార్హం.

సమగ్ర నివేదికలు సిద్ధం చేయండి

- జిల్లా అధికారులకు కలెక్టర్ చేతన్ ఆదేశం



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ చేతన్

పుట్టపర్తి అర్బన్: వివిధ శాఖల ప్రగతి, ఆయా శాఖల పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులు, ప్రస్తుతం కావాల్సిన నిధులను ప్రస్తావిస్తూ సమగ్ర నివేదికలు సిద్ధం చేయాలని కలెక్టర్ చేతన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా అధికారులతో సమీక్షించారు. ఈనెల 11వ తేదీన పుట్టపర్తిలోని సాయిఆరామం వేదికగా జరిగిన జిల్లా స్థాయి సమీక్షా సమావేశంలో మంత్రులు లేవనెత్తిన అంశాల గురించి ఆరా తీశారు. అలాగే ఏపీఐఐసీకి కేటాయించిన భూముల గురించి ఆరా తీశారు. అలాగే జిల్లాలో టిడ్కో ఇళ్లు ఎన్ని మంజూరయ్యాయి, ఎన్ని పూర్తయ్యాయని ఆరా తీశారు. టిడ్కో ఇళ్ల నిర్మాణాలు చేపట్టిన కంట్రాక్టర్లు, ఇంజినీర్లు, హౌసింగ్ అధికారుల బృందంగా ఏర్పడి టిడ్కో ఇళ్ల ప్రస్తుత పరిస్థితిపై నివేదిక ఇవ్వాలన్నారు.

చిత్రావతిలో మురుగు కలవకూడదు

గొల్లపల్లి రిజర్వాయర్ అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అలాగే పుట్టపర్తి సమీపంలోని చిత్రావతి నదిలో డ్రైనేజీ నీరు కలవకుండా చర్యలు చేపట్టాలన్నారు. వీటన్నింటికీ ఎంత మేరకు నిధులు అవసరమో నివేదికలో పేర్కొనాలని సూచించారు. వ్యవసాయ, అనుబంధ రంగాల గురించి రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. సీజనల్ వ్యాధులపై వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమాలను తెలియజేయాలన్నారు. రొద్దం, రత్నగిరి, బైరాంపురం గ్రామాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నిర్మాణాలు వెంటనే పూర్తి చేయాలన్నారు. అలాగే పెండింగ్‌లో ఉన్న 'నీరు-చెట్టు' బిల్లుల గురించి ఆరా తీశారు. రత్నగిరి, రాళ్లపల్లి, జిల్లేడుబండ రిజర్వాయర్ల ప్రస్తుత పరిస్థితి గురించి ఆరా తీశారు. సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, డ్వామా పీడీ విజయేంద్ర ప్రసాద్, పరిశ్రమల శాఖ అధికారి చాంద్‌బాషా, సీపీఓ విజయ్‌కుమార్, డీపీఓ విజయ్‌కుమార్, హౌసింగ్ పీడీ వెంకటరమణారెడ్డి, ఉద్యానశాఖ అధికారి చంద్రశేఖర్, జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు, డీసీహెచ్ఎస్ తిప్పేంద్రనాయక్, డీఎంహెచ్ఓ మంజువాణి, పరిశ్రమల శాఖ జీఎం సోని, టిడ్కో ఈఈ మల్లికార్జున, హెచ్ఎన్ఎస్ఎస్ ఎస్ఈ దేశేనాయక్, ఈఈ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ దారుణహత్య

- రాళ్లతో కొట్టి చంపిన గుర్తు తెలియని వ్యక్తులు



వివరాలు సేకరిస్తున్న ఎస్‌ఐ నరేంద్ర




హత్యకు గురైన చాకలి సూర్యనారాయణ (ఇన్‌సెట్‌లో) సూర్యనారాయణ (ఫైల్)

ధర్మవరం రూరల్: మండల పరిధిలోని సీసీ కొత్తకోట గ్రామం వద్ద శుక్రవారం రాత్రి ఓ ఆటో డ్రైవర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు దారుణంగా హత్య చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు...చాడిమర్రికి చెందిన చాకలి సూర్యనారాయణ(48) 20 ఏళ్ల క్రితం చెన్నేకొత్తపల్లి మండలం వెల్దుర్తి గ్రామానికి వచ్చి స్థిరపడ్డాడు. ఆటో తోలుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఎప్పటిలాగే శుక్రవారం ఉదయం ఇంటి నుంచి ఆటోలో బయలుదేరిన సూర్యనారాయణ రాత్రి ఇంటికి చేరలేదు. శనివారం ఉదయం ధర్మవరం మండలం సీసీ కొత్తకోట సమీపంలోని ఉడతల గుట్ట వద్ద ఓ మృతదేహాన్ని స్థానిక రైతులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకున్న ఎస్‌ఐ నరేంద్ర... మృతుడు చాకలి సూర్యనారాయణగా గుర్తించారు. గుర్తు తెలియని వ్యక్తులు సూర్యనారాయణను ఆటోలో ఇక్కడివరకూ తీసుకువచ్చి రాళ్లతో కొట్టి హత్య చేసినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. డాగ్ స్క్వాడ్‌ను పిలిపించి నిందితుల ఆనవాళ్ల కోసం గాలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి భార్య కృష్ణవేణి, కూతుళ్లు శిరీష, నందిని, కుమారుడు వంశీకృష్ణ ఉన్నారు.

కేసు ఛేదనకు ప్రత్యేక బృందం

చాకలి సూర్యనారాయణ హత్య కేసు ఛేదనకు ఇన్‌చార్జ్ డీఎస్పీ జాన్‌సైదా, ధర్మవరం రూరల్ సీఐ నేతృత్వంలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసినట్లు ఎస్పీ వి. రత్న తెలిపారు. జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయంగా పనిచేస్తున్నామన్నారు. వీలైనంత త్వరలో నిందితులను కోర్టు ముందు ప్రవేశపెడతామన్నారు. అంతకుముందు ఎస్పీ హత్య జరిగిన ప్రదేశాన్ని పరిశీలించారు. సంఘటనా స్థలంలో దొరికిన ఆధారాల గురించి ఆరా తీశారు. అనంతరం ఎస్పీ వి. రత్న ధర్మవరం రూరల్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్ ఆవరణను, రిసెప్షన్ కౌంటర్‌ను పరిశీలించారు. సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. రాత్రి వేళల్లో గస్తీ పెంచాలని సూచించారు. రౌడీ షీటర్ల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. సాయంత్రం వేళల్లో విజిబుల్ పోలీసింగ్ నిర్వహించాలన్నారు.



హత్య జరిగిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ

క్లుప్తంగా

పూల వ్యాపారి అనుమానాస్పద మృతి


రెడ్డిబాషా మృతదేహం

కదిరి అర్బన్: పూల వ్యాపారి ఒకరు అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. వివరాలిలా ఉన్నాయి. కదిరికి చెందిన రెడ్డిబాషా (29) పూల వ్యాపారం నిర్వహించేవాడు. శుక్రవారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. శనివారం ఉదయం వరిగిరెడ్డిపల్లి సమీపంలోని కల్వర్టు కింద ఇతడు విగత జీవిగా పడి ఉన్నాడు. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న రూరల్ పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. రెడ్డిబాషా మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కదిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు.రెడ్డి బాషాకు మద్యం అలవాటు ఉందని, మత్తులో ఏమైనా కల్వర్టు కిందపడి చనిపోయి ఉండొచ్చని రూరల్ అప్‌గ్రేడ్ స్టేషన్ సీఐ మోహన్ తెలిపారు. మృతుడి అన్న ఖాదర్‌బాషా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

రేపు అర్చకుల సమావేశం

అనంతపురం కల్చరల్: అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల అర్చకుల సమావేశం సోమవారం అనంతపురం మొదటిరోడ్డు కాశీ విశ్వేశ్వరాలయంలో జరుగనుంది. ఈ మేరకు జిల్లా అర్చక సమాఖ్య అధ్యక్షుడు వైపీ ఆంజనేయులు ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం ఆలయ ప్రాంగణంలో జరిగే సమావేశానికి రెండు జిల్లాల దేవదాయశాఖ అధికారులు వస్తారని, అర్చకులందరూ విచ్చేసి తమ సమస్యలను ప్రస్తావించాలని కోరారు.

ఆర్టీసీ డ్రైవర్ నిజాయితీ


ప్రయాణికురాలికి బ్యాగు అందిస్తున్న అధికారులు

కదిరి అర్బన్: ఆర్టీసీ బస్సులో బ్యాగు మరచిపోయి ప్రయాణికురాలికి తిరిగి అందజేసి డ్రైవర్ జీవ్లానాయక్ నిజాయితీ చాటుకున్నారు. రాయచోటికి చెందిన తేజస్విని శుక్రవారం సాయంత్రం కదిరికి వచ్చేందుకు రాయచోటిలో బస్సు ఎక్కింది. కదిరిలో జీవిమానుకూడలి వద్ద బ్యాగు బస్సులోనే మరిచి దిగిపోయింది. ప్రయాణికులందరూ దిగిపోయాక ఆ బ్యాగును డ్రైవర్ గుర్తించి అసిస్టెంట్ మేనేజర్ హరితకు అందజేశారు. బ్యాగులో రూ.2 లక్షలు విలువ చేసే బంగారు చైను, ఉంగరాలు ఉన్నాయి. బ్యాగులో ఉన్న వస్తువుల ఆధారంగా ప్రయాణికురాలిని డిపోకు పిలిపించి బ్యాగు అందజేశారు. డ్రైవర్ నిజాయితీని అందరూ మెచ్చుకున్నారు.

22 నుంచి 'శిక్షా సప్తాహ్'

- వారం రోజుల పాటు ప్రభుత్వ పాఠశాలల్లో తప్పనిసరి కార్యాచరణ
- మార్గదర్శకాలు జారీ చేసిన రాష్ట్ర సమగ్ర శిక్ష
- ఎన్‌ఈపీ ప్రవేశపెట్టి నాలుగేళ్లు పూర్తవుతున్న సందర్భంగా వేడుకలు
- స్థానికులు, విద్యార్థుల తల్లిదండ్రుల భాగస్వామ్యం తప్పనిసరి


పర్యావరణ పరిరక్షణ కార్యక్రమంలో భాగంగా శెట్టూరు కేజీబీవీలో మొక్కలు నాటుతున్న విద్యార్థులు, ఎస్‌ఓ లలిత, తదితరులు

తాడిపత్రి రూరల్: ఉమ్మడి జిల్లాల్లోని పాఠశాలల్లో ఈ నెల 22 నుంచి 28 తేదీ వరకు శిక్షా సప్తాహ్ వేడుకలు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలను రాష్ట్ర సమగ్ర శిక్ష అధికారులు జారీ చేశారు. వేడుకలను విజయవంతం చేయడానికి స్థానికులు, విద్యార్థుల తల్లిదండ్రులను అధిక సంఖ్యలో భాగస్వాములను చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు.

నాల్గవ వార్షికోత్సవం సందర్భంగా

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ యాజమాన్య పరిధిలో 3,600 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ఇందులో అనంతపురం జిల్లాలో 1,582 పాఠశాలలు, శ్రీసత్యసాయి జిల్లాలో 2,018 పాఠశాలలు ఉన్నాయి. 2020లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన జాతీయ నూతన విద్యా విధానం నాలుగేళ్లు పూర్తవుతున్న సందర్భంగా ఆయా పాఠశాలల్లో వారం రోజుల పాటు శిక్షా సప్తాహ్ పేరుతో వివిధ కార్యక్రమాలు నిర్వహించేలా రాష్ట్ర సమగ్ర శిక్ష కార్యాచరణను రూపొందించింది.

డాక్టర్ కస్తూరిరంగన్ సిఫారసుల మేరకు ఎన్‌ఈపీ

దేశంలో కొత్తగా జాతీయ విద్యా విధానాన్ని అమలు చేయాలన్న దానిపై డాక్టర్ కృష్ణస్వామి కస్తూరిరంగన్ కమిటీ చేసిన సిఫారసుల మేరకు ఎన్‌ఈపీ -2020ని ప్రవేశ పెట్టారు. అప్పటి వరకూ ఉన్న 10+2+3 విద్యావిధానాన్ని రద్దు చేసి 5+3+3+4 విద్యా విధానాన్ని అమలు చేశారు. కొత్త విధానాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు శిక్షా సప్తాహ్ వేడుకలను వారం రోజుల పాటు జరపనున్నారు. వేడుకలను మొక్కుబడిగా కాకుండా చిత్తశుద్ధితో నిర్వహించాలని విద్యాశాఖ నుంచి ఎంఈఓలకు ఉత్తర్వులు జారీ అయ్యాయి.

ప్రతి పాఠశాలలో వేడుకలు తప్పనిసరి



శిక్ష సప్తాహ్ వేడుకలను ప్రతి పాఠశాలలో తప్పనిసరిగా నిర్వహించాలి. రాష్ట్ర సమగ్ర శిక్ష ఉత్తర్వుల మేరకు వారం రోజుల పాటు చేయాల్సిన కార్యక్రమాల వివరాలను పాఠశాల ప్రధానోపాధ్యాయులకు అందజేశాం. వాటిని అనుసరించి కార్యక్రమాలు చేపట్టాలి.

–నాగరాజు, ఎంఈఓ, తాడిపత్రి

వారం రోజుల పాటు జరిగే వేడుకలు ఇవే...

ఈ నెల 22 నుంచి 28వ తేదీ వరకు జరిగే శిక్ష సప్తాహ్ వేడుకలను నిర్వహించడంలో భాగంగా ఏ రోజు ఏ కార్యక్రమం చేపట్టాలనే అంశంపై విద్యాశాఖ వివరాలను అందచేసింది.

- 22న స్థానికంగా లభించే వనరులను ఆసరాగా చేసుకుని అభ్యసన సామగ్రిని తయారు చేయడం. తయారు చేసిన సామగ్రిని పరిశీలించడానికి విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు స్థానిక ప్రజలను ఆహ్వానించి వారి ప్రశంసలు పొందడం.
- 23న పునాది అభ్యసన కార్యక్రమంలో భాగంగా 1వ తరగతి నుంచి భాషపై విద్యార్థులు మంచి నైపుణ్యం సాధించేలా చేయడం. గణితంలోని సంఖ్యా శాస్త్రంపై పట్టు సాధించేందుకు చర్చల ద్వారా అవగాహన కల్పించడం.
- 24న వివిధ క్రీడలపై విద్యార్థులకు పోటీలు నిర్వహించడం. పోటీల ద్వారా వారిలో క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీయడం, శారీరక సౌష్టవం ప్రాముఖ్యతను వివరించడం.
- 25న భిన్నత్వంలో ఏకత్వం భావనను విద్యార్థుల్లో పెంపొందించేలా సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేయడం. ప్రధానంగా క్లాసికల్, ఫ్యాన్సీ డ్రెస్‌లు, నృత్య ప్రదర్శన, పాటల పోటీలు, నాటిక ప్రదర్శనలు తదితర కార్యక్రమాలు నిర్వహించడం.
- 26న సాంకేతిక నైపుణ్యాల దినోత్సవంలో భాగంగా విద్యలో సాంకేతికాభివృద్ధిని గుర్తించేలా చర్చలు జరపడం. ఉద్యోగ అవకాశాలను దృష్టిలో ఉంచుకుని తరగతి గదుల సౌకర్యాలు మెరుగు పరుచుకుని డిజిటల్ విద్య కార్యక్రమాలకు అవసరమయ్యే నూతన నైపుణ్యాలను గుర్తించడం.
- 27న పర్యావరణ పరిరక్షణ కార్యక్రమంలో భాగంగా మిషన్ లైఫ్ యాక్టివిటీస్, న్యూట్రిషన్ డే, కొత్తగా ఏకో క్లబ్‌ల ఏర్పాటు, అమ్మకు అంకితం కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు, తల్లులతో కలసి మొక్కలు నాటడం, మాతృభూమి మధ్య బంధం పెంచడానికి ప్రతి పాఠశాలలో తల్లీబిడ్డలతో కలసి 35 మొక్కలు నాటడం.
- 28న సామాజిక భాగస్వామ్య దినోత్సవంలో భాగంగా చివరి రోజు ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రులతో కలసి కమిటీలను ఏర్పాటు చేయడం. ఉపాధ్యాయ సంఘాల సహకారంతో వివిధ కార్యక్రమాలపై అవగాహన సదస్సులు ఏర్పాటు చేయడం.

లింక్‌లు పంపి.. రూ.23 లక్షలు దోచి

- మహిళను మోసగించిన సైబర్ నేరగాళ్లు

హిందూపురం అర్బన్: మహిళకు ఆశ చూపి.. సైబర్ నేరగాళ్లు రూ.లక్షలు దోచేశారు. వివరాలిలా ఉన్నాయి. ముద్దిరెడ్డిపల్లికి చెందిన సింధూ అనే మహిళ ×టెలిగ్రామ్× చానల్ ద్వారా లింక్ పంపి తన వీడియోలు షేర్ చేసేది. అలా పంపిన ఒక్కో వీడియో (రీల్)కు అటు వైపు నుంచి రూ.2000, రూ.6,800, రూ.10వేలు చొప్పున అటువైపు (సైబర్ నేరగాళ్లు) నుంచి సింధూ బ్యాంకు ఖాతాకు జమ అయ్యేవి. అలా వారు పంపిన లింక్‌లను గుడ్డిగా ఓపెన్ చేయగా.. ఆమె ఖాతా నుంచి రూ.23.50 లక్షలకు పైగా దోచారు. బాధితురాలు శనివారం రాత్రి హిందూపురం వన్‌టౌన్ సీఐ శ్రీనివాసులు కేసు నమోదు చేశారు. సైబర్ నేరగాళ్లు ఎప్పటికప్పుడు కొత్తగా మోసాలకు పాల్పడుతుంటారని, వారి వలలో పడకుండా ప్రజలు జాగ్రత్త వహించాలని సీఐ హెచ్చరించారు.

వీధి బాలలను పాఠశాలలో చేర్పించండి


సమావేశంలో పాల్గొన్న డీఈఓ మీనాక్షి

కొత్తచెరువు: జిల్లా వ్యాప్తంగా బడి బయట పిల్లలను, వీధి బాలలను గుర్తించి పాఠశాలలో చేర్పించేందుకు కృషి చేయాలని డీఈఓ మీనాక్షి తెలిపారు. శనివారం కొత్తచెరువు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఎంఈఓలతో నెలవారీ సమీక్ష సమావేశం నిర్వహించారు. డీఈఓ మాట్లాడుతూ విద్యార్థుల అటెండెన్స్, ట్యాబ్‌ల పంపిణీ వివరాలు ఎక్సెల్ షీట్‌లో పొందుపరచాలని, ఉపాధ్యాయుల సర్దుబాటు, పాఠశాలలో వంటమనిషి, ఆయాల పనితీరు, కోడి గుడ్లు, చిక్కీల బిల్లులు గురించి చర్చించారు.

పావగడలో చోరీ

పావగడ: కర్ణాటక రాష్ట్రం పావగడ పట్టణంలోని జ్ఞాన బోధిని పాఠశాల సమీపాన ఓ ఇంట్లో చోరీ జరిగింది. జిలానీ అనే వ్యక్తి కుటుంబ సభ్యులతో బెంగళూరుకు వెళ్లాడు. ఇంటికి తాళం వేసి ఉండటం గమనించిన దుండగులు శుక్రవారం రాత్రి చోరీకి పథకం వేశారు. తాళాలు పగులగొట్టి లోనికి ప్రవేశించిన దుండగులు బీరువాలో భద్రపరచిన రూ.4 లక్షలు విలువ చేసే 13 బంగారు ఉంగరాలు, చెవి పోగులు, వెండి సరం తదితర వస్తువులు అపహరించుకుపోయారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

తెగుళ్లు నివారించుకోండి


వేరుశనగ పంటను పరిశీలిస్తున్న డీఏఓ సుబ్బారావు, ఏడీఏ సత్యనారాయణ తదితరులు

కదిరి అర్బన్: మున్సిపల్ పరిధిలోని కుటాగుళ్లలో రైతులు సాగుచేస్తున్న వేరుశనగ, కంది పంటలను శనివారం జిల్లా వ్యవసాయాధికారి (డీఏఓ) సుబ్బారావు పరిశీలించారు. వేరుశనగకు ఆశించిన పొగాకు, లద్దె పురుగుల నివారించేందుకు క్వినాల్‌ఫాస్, క్లోరిఫైరిఫాస్, థయోడికార్బ్ తగిన మోతాదులో పిచికారి చేయాలన్నారు. కంది పంటలో ఎండు తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఆయన వెంట ఏడీఏ సత్యనారాయణ, ఏఓ శ్రీనివాసరెడ్డి, రైతులు రామాంజనేయులు, రాజు తదితరులు పాల్గొన్నారు.

జీతమో...రామచంద్రా!

- 16న బడ్జెట్ విడుదల చేసిన ప్రభుత్వం
- జిల్లా కార్యాలయం గేటు దాటని జీతాలు
- జీతాల కోసం అల్లాడిపోతున్న సమగ్ర శిక్ష కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు



అనంతపురం ఎడ్యుకేషన్: దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించలేదన్న చందంగా తయారైంది ఉమ్మడి జిల్లాలోని సమగ్ర శిక్ష ఉద్యోగుల జీతాల పరిస్థితి. ఈ నెల 16న ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు జీతాలకు సంబంధించిన బడ్జెట్ విడుదల చేసింది. ఇందులో భాగంగా ఉమ్మడి జిల్లాకు రూ. 13.03 కోట్లు కేటాయించింది. అనంతపురం జిల్లాకు రూ.6.57 కోట్లు, శ్రీసత్యసాయి జిల్లాకు రూ.6.46 కోట్లు విడుదల చేశారు. ఉద్యోగుల జీతాల క్లైయిమ్స్, ఇతరత్రా బిల్లులు అప్పటికే అన్నీ సిద్ధం చేసి సమగ్రశిక్ష జిల్లా కార్యాలయాలకు పంపారు. కానీ జీతాలు ఉద్యోగుల బ్యాంకు ఖాతాల్లో జమ కాలేదు. రాష్ట్ర వ్యాప్తంగా ఇతర జిల్లాల్లో బడ్జెట్ విడుదలైన రెండు రోజుల్లోనే జీతాలు జమ చేశారు. కానీ మన రెండు జిల్లాల్లో అధికారుల వైఫల్యం కారణంగా ఉద్యోగుల జీతాలు జమ కాలేదు. రెండు జిల్లాలోని సమగ్ర శిక్ష కార్యాలయాల్లోని రెగ్యులర్ ఉద్యోగులతో పాటు కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు మే, జూన్ నెలల జీతాలు రాక అల్లాడిపోతున్నారు. కుటుంబాల నిర్వహణ కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సమగ్ర శిక్ష విభాగంలో 2,800 మంది దాకా పని చేస్తున్నారు. వీరిలో కేజీబీవీల ప్రిన్సిపాళ్లు, సీఆర్టీలు, పీజీటీలు, పీఈటీలు, కంప్యూటర్, ఒకేషనల్ ఇన్‌స్ట్రక్టర్లు, అటెండర్లు, అకౌంటెంట్లు, వాచ్‌మన్లు, కుక్‌లు, ఏఎస్ఎంలు, ఎమ్మార్సీ కార్యాలయాల్లో ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, డేటాఎంట్రీ ఆపరేటర్లు, అకౌంటెంట్లు, మెసెంజర్లు, సీఆర్పీలు, పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్లు, భవిత కేంద్రాల్లో ఐఈఆర్పీలు, ఫిజియో థెరపిస్టులు, ఆయాలు, జిల్లా సమగ్ర శిక్ష కార్యాలయాల్లో కంప్యూటర్ ఆపరేటర్లు, అటెండర్లు, సైట్ ఇంజినీర్లు, టీఎల్ఎంటీలు ఉన్నారు. విద్యా సీజన్ కావడంతో చాలామంది ఉద్యోగులు పిల్లల చదువుల ఫీజులు, పుస్తకాలు, ఇతర వాటి కోసం అల్లాడిపోతున్నారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగానే బడ్జెట్ విడుదలైనా తమకు జీతాలు జమ చేయలేదని ఉద్యోగులు వాపోతున్నారు.

బడికెళ్లమంటే తిరుపతికెళ్లాడు!

- కుమారుడి అదృశ్యంపై ఫిర్యాదు
- రెండురోజుల తర్వాత తల్లిదండ్రుల చెంతకు


తిరుపతిలో తెలంగాణకు చెందిన దంపతులతో నిఖిలేశ్వరరెడ్డి (ఎర్ర షర్ట్)

గుత్తి రూరల్: బడికని ఇంటి నుంచి గుత్తికి బయల్దేరిన బాలుడు రైలుబండి ఎక్కి తిరుపతి చేరుకున్నాడు. అక్కడ తెలంగాణ రాష్ట్రానికి చెందిన దంపతులు గమనించి అతడిని తమవెంట తిరుమలకు తీసుకెళ్లి శ్రీవారి దర్శనం చేయించారు. సెల్ఫీ దిగి ఫొటో అప్‌లోడ్ కోసం ఇన్‌స్టా ఐడీ ద్వారా బాలుడి తల్లిదండ్రుల నంబర్ కనుక్కొని సమాచారం ఇవ్వడంతో రెండు రోజుల తల్లిదండ్రుల నిరీక్షణకు తెరపడింది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గుత్తి మండలం అబ్బేదొడ్డి గ్రామానికి చెందిన లావణ్య, కాంతారెడ్డి దంపతుల కుమారుడు సాయి నిఖిలేశ్వరరెడ్డి గుత్తి శివార్లలో ఉన్న ఓ ప్రైవేటు పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. ఈ నెల 18న ఉదయం గ్రామం నుంచి ఆటోలో పాఠశాలకు వెళ్లాడు. సాయంత్రం ఇంటికి తిరిగి రాకపోవడంతో ఆందోళనకు గురైన తల్లిదండ్రులు బంధువులు, తెలిసిన వారి ఇంట్లో గాలించారు. ఎక్కడా ఆచూకీ లభించకపోవడంతో అదే రోజు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా నిఖిలేశ్వరరెడ్డి పాఠశాలకు వెళ్లకుండా తిరుపతికి చేరుకున్నాడు. ఈ నెల 19న ఉదయం తిరుపతి స్టేషన్‌లో నిఖిలేశ్వర్‌రెడ్డి ఒంటరిగా కూర్చుని ఉండగా తెలంగాణ రాష్ట్రం జనగామ పట్టణానికి చెందిన కవిత, అజయ్ దంపతులు గమనించారు. నిఖిలేశ్వర్‌రెడ్డితో మాటలు కలిపి ఎక్కడ నుంచి వచ్చావు, ఎందుకు ఒంటరిగా ఉన్నావు, తల్లిదండ్రులు ఎక్కడున్నారు అని అరా తీయగా సమాధానం ఇచ్చేందుకు నిరాకరించాడు. దీంతో దంపతులకు అనుమానం వచ్చి.. బాలుడిని తమ వెంట తిరుమలకు తీసుకెళ్లారు. అనంతరం తిరిగి కొండ నుంచి కిందకు దిగుతూ ఆ జంట బస్సులో నిఖిలేశ్వర్‌రెడ్డితో సెల్ఫీ దిగారు. అనంతరం తెలివిగా 'నీ ఇన్‌స్టాగామ్ ఐడీ చెప్పు అందులో ఫొటో అప్‌లోడ్ చేద్దాం' అని కనుక్కున్నారు. ఇన్‌స్టాలో నిఖిలేశ్వర్‌రెడ్డి తండ్రి ఫోన్ నంబర్‌ను గుర్తించారు. అనంతరం తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. తండ్రి కాంతారెడ్డి పోలీసులకు సమాచారం అందించి తిరుపతికి వెళ్లి కవిత, అజయ్ దంపతులకు కృతజ్ఞతలు తెలిపి నిఖిలేశ్వర్‌రెడ్డిని గ్రామానికి తీసుకొచ్చారు. అదృశ్యమైన తమ బాలుడు తిరుపతిలో దొరకడంతో తల్లిదండ్రులు ఆనందంలో తేలిపోయారు. అయితే బాలుడు తిరుపతికి ఎందుకెళ్లాడో సరైన సమాధానం చెప్పలేదు.

పాముకాటుకు గురైన రైతు మృతి


మృతుడు శ్రీరంగారాజు

రొద్దం: పాముకాటుకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రైతు మృతి చెందాడు. చెరుకూరు గ్రామానికి చెందిన శ్రీరంగరాజు (65) అనే రైతు శుక్రవారం మధ్యాహ్నం ఇంటి వద్ద పాము కాటుకు గురయ్యాడు. పరిస్థితి విషమంగా ఉండడంతో బెంగళూరులోని ఓ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో శనివారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

ఎన్‌ఏసీలో శిక్షణ, ఉద్యోగావకాశాలు

హిందూపురం టౌన్: నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్స్(ఎన్‌ఏసీ), ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో యువతకు ఉచిత శిక్షణ, ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నట్లు ఎన్‌ఏసీ ఏడీ గోవిందరాజులు శనివారం పేర్కొన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులైన వారికి ఎలక్ట్రీషియన్ కోర్సులో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. 18 నుంచి 35 ఏళ్ల లోపు వారు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు ఈ నెల 23లోపు ఆధార్, రేషన్ కార్డు, అర్హత ధ్రువపత్రాలు, పాస్ పోర్టు, సైజు ఫొటోలతో హిందూపురం ముక్కిడిపేటలోని ఓల్డ్ ఎస్సీ బాయ్స్ హాస్టల్ కార్యాలయంలోని ఎన్‌ఏసీ శిక్షణ కేంద్రం, ఫోన్ నంబర్ 90529 01657, 91105 50779లలో సంప్రదించాలని సూచించారు.

ప్రతి విషయం క్షుణ్ణంగా తెలుసుకోవాలి

పుట్టపర్తి అర్బన్: రెవెన్యూ ఉద్యోగులు తమ శాఖలోని ప్రతి విషయమూ క్షుణ్ణంగా తెలుసుకోవాలని సీపీఓ విజయ్‌కుమార్ సూచించారు. రెవెన్యూ ఉద్యోగులకు వారం రోజుల శిక్షణ తరగతులు శనివారం శనివారం కలెక్టరేట్‌లోని సీపీఓ కార్యాలయంలో ప్రారంభమయ్యాయి. ధర్మవరం రెవెన్యూ డివిజన్ ఉద్యోగులు పాల్గొన్నారు. సీపీఓ మాట్లాడుతూ వంటకోత ప్రయోగాల పరిశీలన, వ్యవసాయ గణన, వర్షపాతం నమోదు తదితర విషయాలపై అవగాహన అవసరమన్నారు. కార్యక్రమంలో ఏడీ ప్రకాష్‌రావు, డిప్యూటీ స్టాటస్టికల్ అధికారి శ్రీనివాసనాయక్, గోపాల్, ట్రైనీస్టులు, జేఏలు, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా శ్రీగిరి రథోత్సవం


రథాన్ని లాగుతున్న భక్తులు

పుట్టపర్తి రూరల్: గురుపౌర్ణమిని పురస్కరించుకుని శనివారం సాయంత్రం సత్యసాయి శ్రీగిరి రథోత్సవం వైభవంగా నిర్వహించారు. ప్రశాంతి నిలయం ముఖ ద్వారం వద్ద అందంగా అలంకరించిన సత్యసాయి చిత్రపటాన్ని రథంలో ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రథాన్ని లాగుతూ ఊరేగింపుగా ప్రశాంతి నిలయం, విద్యాగిరి, గోకులం, ఎనుములపల్లి, గణేష్ కూడలి, పెట్రోల్‌బంక్, చింతతోపు, శివాలయం వీధి, హనుమాన్ కూడలి, గోవిందయ్యపేట, పెద్దబజార్ మీదుగా ప్రశాంతి నిలయానికి చేర్చారు. దేశ విదేశీ భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.